నవతెలంగాణ

1

ఆదిలాబాద్

ఆదివారం | జనవరి 7, 2024 | www.navatelangana.com

గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఆటో దగ్ధం

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నివాసముంటున్న మునుగురి పరమేశ్వర్‌కు చెందిన ఆటోకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఇంటి ముందు పార్కు చేసి ఉన్న ఆటోకు నిప్పంటి వెళ్లిపోయారు. ఉదయం లేచి చూసేసరికి ఆటో పూర్తిగా దగ్ధమై ఉంది. దీంతో బాధితుడు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై లింబాద్రి ఘటన స్థలానికి వెళ్లి కాలిపోయిన ఆటోను పరిశీలించారు.



జిల్లా న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా న్యాయస్థానంలో జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన బోయ శ్రీనివాసులును శనివారం కలెక్టర్ బదావత్ సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. శనివారం మున్సిపాలిటీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ గడికొప్పుల ఉమాదేవి, 15వ వార్డు కౌన్సిలర్ షబానా – సజ్జు, మహమ్మద్ కలీం, మహమ్మద్ ఫరూక్, అడ్వకేట్ సుమన్ చక్రవర్తి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు కలెక్టర్ కార్యాలయంలో చైర్మెన్‌కు మద్దతు ఉపసంహరించుకున్నట్టు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ ఆలీ, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27న ప్రత్యేక వైద్య శిబిరం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో హైదరాబాద్ జిల్లా వినియోగదారుల స్పోర్ట్స్ రెడ్‌సెల్ కమిషన్ సభ్యురాలు మాధవి శాసనకోట, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జీసీ. సుబ్బారాయుడుతో వైద్య శిబిరం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహణ కొరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని, వైద్యాధికారులు, వైద్యులు, తగినంత సిబ్బంది, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రయివేట్ ఆసుపత్రుల నుండి వైద్య నిపుణులను ఏర్పాటు చేయాలని, గుండె సంబంధిత పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఐఎంఎ సమన్వయం చేసుకోవాలని, ఎలాంటి సమస్యలు లేకుండా శిబిరం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రాజేశ్వర్, వైద్యాధికారి డా. ఫయాజ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం నలంద కళాశాలలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించి ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్, రేషన్ కార్డు, సెల్ నెంబర్లను సరిచేసుకొని నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ శైలజ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాదవ్ కృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ద్వారకాపూర్‌లో ప్రజాపాలన గ్రామసభ



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ద్వారకాపూర్ సర్పంచ్ మాసాడి శారద అధ్యక్షతన శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ప్రజలకు చదివి వినిపించారు. అధికారులు ప్రజల వద్ద నుండి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. మండలంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ద్వారకాపూర్ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, ఉప సర్పంచ్ పుర్ర శేఖర్, ఏఈ ప్రభాకర్, టీఏ రమేష్ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో టీయూటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఎంపీపీ రొడ్డ లక్ష్మీ రమేశ్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీయూటీఎఫ్ కృషి చేస్తోందని టీయూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ నాయకులు చిందం చిన్నయ్య రొడ్డ మల్లేశ్, రాజన్న, సురేశ్, వేణుమాధవ్, వెంకటరమణ, సత్తయ్య, సోనేరావు పాల్గొన్నారు.

గిరి ఆవాసం..జీవన సౌకర్యం..!

- పీవీటీజీ ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ
- పీఎం జన్‌మన్ ద్వారా సకల సదుపాయాలు
- 11అంశాలు..తొమ్మిది శాఖలు భాగస్వామ్యం
- ఈ నెల 15 నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు

ఆదివాసుల సంక్షేమం..వారి జీవనానికి సకల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెడుతున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం గిరిజన తెగల్లో అత్యంత వెనుకబడిన(పీవీటీజీ)ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌మన్) పథకానికి శ్రీకారం చుట్టింది. పీవీటీజీ ఆవాస ప్రాంతాల్లో 11 అంశాలను మెరుగుపర్చి ఆదివాసీల జీవనంలో మెరుగైన వసతులు కల్పించాలని భావిస్తోంది. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 390 ఆవాస ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. గిరిజన మంత్రిత్వశాఖ ద్వారా అమలవుతున్న ఈ పథకంలో ఏకంగా తొమ్మిది ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కానున్నాయి. ఇప్పటికే ఈ పథకంపై ఆయా శాఖల అధికారులకు అవగాహన కల్పించిన యంత్రాంగం..ఈ నెల 15వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు అధికంగా ఉంటారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు గడిచినా..ఇప్పటికీ ఆదివాసీ గూడేల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. కనీసం తాగేందుకు స్వచ్ఛమైన నీటితో పాటు అనారోగ్యం వస్తే నాణ్యమైన వైద్యం కూడా లభించని పరిస్థితి ఉంది. మరోపక్క ఉండేందుకు కనీసం పక్కా ఇండ్లు కూడా లేని దైన్యం కనిపిస్తోంది. గిరిజన తెగల్లో అత్యంత వెనుకబడింది పీవీటీజీలే. ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నా.. వీరి జీవనంలో మాత్రం ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. ఇప్పటికీ పీవీటీజీ ప్రాంతాలు అత్యంత వెనుకబాటులోనే ఉండిపోయాయి. పాలకులు, ఉన్నతాధికారులు ఆయా గ్రామాలను తరుచూ సందర్శిస్తున్నా..వీరి అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ వంటి సంస్థను ఏర్పాటుచేసినా.. ఆయా గ్రామాల్లో కనీస సౌకర్యాలకు నోచుకోలేని పరిస్థితి ఉంది. ఈ ప్రాంతాల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. వీటిలో సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా రూ.24వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోంది.



జన్‌మన్ పథకంపై గిరిజనులకు అవగాహన(ఫైల్)

11 అంశాల్లో సౌకర్యాలు..!

ఉమ్మడి జిల్లాలోని అత్యంత వెనుకబడిన గిరిజన తెగ(పీవీటీజీ) ప్రాంతాల్లో వివిధ సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. వీటి ద్వారా 11అంశాలను మెరుగుపర్చాలని కార్యాచరణ రూపొందించారు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యవంతమైన ఇండ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ కోసం మల్టీపర్పస్ కేంద్రాలు, సంచార వాహనాలు, మెరుగైన విధానాల ద్వారా వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పించడం, ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటుచేసి స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించడం, సౌర విద్యుత్ పథకం ద్వారా ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, పౌష్టికాహారం కోసం 100జనాభా కలిగిన ప్రాంతానికి ఒక అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు, జీవనోపాధి కల్పించడం, టెలిఫోన్ సౌకర్యం, వంటగ్యాస్, ఆయుష్మాన్‌భారత్, గర్భిణీలకు ఆర్థికసాయం తదితర సదుపాయాలను కల్పించనున్నారు. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆధార్, ఓటు హక్కు నమోదు తదితర మౌళిక



ఖండాల పంచాయతీ పరిధిలోని పాటగూడలో ఆధార్ నమోదు కేంద్రం

ఉమ్మడి జిల్లాలో ఈ పథకం ద్వారా అభివృద్ధి చేసే ఆవాస ప్రాంతాలు	
జిల్లా	ఆవాస ప్రాంతాలు
ఆదిలాబాద్	197
కుమురంభీం ఆసిఫాబాద్	149
నిర్మల్	24
మంచిర్యాల	20

వసతులను కల్పించేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది.

మూడేండ్లలో పూర్తిచేసేందుకు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం ద్వారా పీవీటీజీ ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పించడం రెండేండ్లలో పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2023-24, 2025-2026 ఏడాదికి గాను ఈ సౌకర్యాలు కల్పించాలని సూచించింది. ఇందులో గిరిజన మంత్రిత్వశాఖతో పాటు తొమ్మిదిశాఖల సమన్వయంతో నిధుల కేటాయింపు జరగనుంది. పంచాయతీరాజ్, అటవీ, వ్యవసాయం, వైద్యం, విద్యుత్, గ్రామీణ తాగునీటి సరఫరా, విద్య తదితర శాఖలు భాగస్వామ్యం కానున్నట్లు తెలుస్తోంది. ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలను సైతం ఏర్పాటుచేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆయా ప్రాంతాల్లో పనులను ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దుబ్బగూడెం కాలనీలో సదుపాయాలు కల్పిస్తాం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ - కాసిపేట

సింగరేణి ఓపెన్‌కాస్ట్ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెం నూతన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దుబ్బగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓసీలో నష్టపోతున్న దుబ్బగూడెం గ్రామస్తులకు సంబంధించి వసతుల కల్పనపై న్యాయం చేస్తామన్నారు. దుబ్బగూడెం గ్రామస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కాలనీ పనులు త్వరగా పూర్తి చేయాలని, కాలనీవాసులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం శాలువాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, సహకార చైర్మన్ నీలా, సర్పంచ్ దరావత్ దేవి, ఎంపీటీసీ అక్కెపల్లి లక్ష్మీ, వార్డ్ మెంబర్ గోనెల శ్రీలత, ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యులు గోనెల శ్రీనివాస్, బూరుగుపల్లి రమేశ్, దుర్గం శ్రీను, బోగె రామకృష్ణ, బిజ్జూరి జయ, సింగరేణి పీవో రమేశ్, ఎస్టేట్ ఆఫీసర్ కుమారస్వామి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీలకు ముత్యంపల్లి విద్యార్థులు



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు నవనందుల బిందు ప్రియ, గాజుల నరేందర్ ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 13 వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. సాంప్రదాయ బొమ్మలు, ఆటలు అనే అంశాలపై జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. నవనందుల బిందు ప్రియ తోలు బొమ్మల ఆటలతో బాలిక విద్య, జాతీయ సమాఖ్యత, ఓటు హక్కు, కరోనా జాగ్రత్తలపై ప్రదర్శన ఇవ్వనుంది. గాజుల నరేందర్ చిన్నయ్య సూరి పంచతంత్ర కథలో నుంచి అంశాలను తీసుకొని స్వయంగా చెక్క పెట్టు ఆధారంగా తయారు చేసిన బొమ్మలతో కథను ప్రదర్శించనున్నాడు. ఈ మేరకు రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు, గైడ్ టీచర్ బండ శాంకరిని, డీఈవో యాదయ్య, ఎంఈవో వాసాల ప్రభాకర్, ముత్యంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి అభినందించి, జాతీయ స్థాయి పోటీల్లో గెలవాలని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గిరిజనుల అభివృద్ధికే ప్రధానమంత్రి జన్‌మన్ యోజన

నవతెలంగాణ-జన్నారం

అంతరించిపోతున్న ఆదిమ గిరిజన జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకాన్ని ప్రారంభించిందని డిటిడిఓ గంగారాం అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గిరిజన గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాశ్వత నివాసాలు కల్పించడం, లింకు రోడ్డు నిర్మించడం, పైపులైన్ ద్వారా సామాజిక నీటి సరఫరా వసతులు ఏర్పాటు చేయడం, మొబైల్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం తదితర సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నైపుణ్య అభివృద్ధి కోర్సులను ఏర్పాటు చేయడంతో పాటు అంగన్వాడీ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో భాగంగానే కొత్తపేటలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. గర్భిణులకు సాధికారిక, సౌర శక్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాటి ద్వారా గ్రామాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఆరు మల్టీపర్పస్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ మాలావత్ లావణ్య ప్రేమ్‌సింగ్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణారాణి, కార్యదర్శి భీంరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీఓ గంగారాం



పాల్గొన్న గిరిజనులు

గిరిజన గ్రామాల్లో దుప్పట్ల పంపిణీ



ఖానాపూర్ : లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కొలాంగూడకు చెందిన పేద గిరిజన కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సాదుల వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా చైర్మెన్ కారింగుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజ సేవే పరమావధిగా ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపయుక్తమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అంధత్వ నివారణ, ఆకలి లేని సమాజ నిర్మాణం కోసం, విద్య వైద్య సౌకర్యాల కల్పనకు తమవంతుగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వారం క్యాంప్ నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ పాలెపు సుదర్శన్, జిల్లా ప్రతినిధులు అయిల్నేని సంజీవరావు, కొండాడి శ్రీనివాస్‌రావు, క్లబ్ సీనియర్ సభ్యులు ఏనుగు భూపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ గంగామణి రాజేందర్, ఉపసర్పంచ్ టేకం భీమారావు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని కాప్రి, బాలాపూర్ గ్రామాలకు చెందిన తిప్పిరెడ్డి, సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న బాధిత కుటుంబాలను



పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అతని వెంట ఎంపీపీ గోవర్ధన్, నాయకులు లింగారెడ్డి, బాలాపూర్ సర్పంచ్ జక్కుల వినోద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని చాత గ్రామానికి చెందిన కట్ట పోశెట్టి భార్య బోజక్క ఇటీవల అనారోగ్యంతో మరణించింది. శనివారం విషయం తెలుసుకున్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ పటేల్, మండల నాయకుడు సాఫ్లీ రమేష్, మాజీ ఎంపీటీసీ వెంకటరావు పటేల్, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



ఒంటికీ, రెంటికీ తప్పని తిప్పలు



నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మరుగుదొడ్డికి పోవాలంటే ఒకరి తర్వాత ఒకరు మాత్రమే పోవాల్సి రావడంతో విద్యార్థినులకు తిప్పలు తప్పడం లేదు. తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 186 విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు. అందులో 80 మంది బాలికలు ఉన్నారు. ఈ బాలికలకు అవసరమైన మేరకు టాయిలెట్స్ లేకపోవడం, కేవలం ఒకటే ఉండటం వల్ల విద్యార్థినులు టాయిలెట్‌కు వెళ్లాలంటే ఎంతో సమయం పడుతుందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ చూపి టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

అక్రమ కూరగాయల దుకాణాన్ని తొలగించాలి

- తిమ్మాపూర్ వీడీసీ సభ్యుల ఫిర్యాదు



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని ఉర్దూ పాఠశాల ముఖద్వారం గేటును మూసేసి అక్రమంగా ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణాన్ని వెంటనే తొలగించాలని శనివారం తిమ్మాపూర్ వీడీసీ సభ్యులు లిఖితపూర్వకంగా మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాల లోపలికి వెళ్లే గేటు ముందు అడ్డుగా కూరగాయల దుకాణం ఏర్పాటు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. షాపును తొలగించి గేటు తెరిచి ఉంటే వాహనాలు సైతం లోపల పెట్టుకునే అవకాశం ఉందని అన్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన షాపును తొలగించాలని కోరారు. ఇందులో తిమ్మాపూర్ వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న, వీడీసీ సభ్యులు ఉన్నారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల స్వీకరణ శనివారంతో గడువు ముగిసింది. నార్నూర్ మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో అదేవిధంగా గాదిగూడ మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు గ్రామ పంచాయతీలో అధికారులకు దరఖాస్తులను అందించారు. శనివారం ఉమ్మడి మండలంలోని మలంగి, బలాన్‌పూర్, పరస్‌వాడా గ్రామపంచాయతీతో పాటు ఆయా గ్రామాల్లో చివరి రోజు కావడంతో అదికారులకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారులతో పాటు సర్పంచ్ పూసం రుపా, ఆత్రం పరమేశ్వర్ కార్యదర్శి స్నేహ, అవినాష్ ఉన్నారు.

అయోధ్య అక్షింతల వితరణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండల కేంద్రంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ ఆధ్వర్యంలో శనివారం అయోధ్య రాములోరి అక్షింతలు వితరణ చేశారు. ప్రతి ఒక్కరూ అయోధ్య రామాలయ ప్రతిష్ఠపాన రోజు భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యం రెడ్డి, బీజేపీ నాయకులు గుడ్ల రంజిత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడెం : అయోధ్య నుంచి తీసుకువచ్చిన రాములోరి అక్షింతలను శనివారం అంబారిపేట్ గ్రామంలోని హనుమాన్ గుడి వద్ద భక్తులు ఘనంగా స్వాగతం పలికి, భజన పాటలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం రోజు నుంచి ప్రధాన వీధుల్లో ఊరేగిస్తామని గ్రామ సర్పంచ్ కొప్పుల లక్ష్మి లచ్చన్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కట్ల సింధుజా సాగర్, ఉపసర్పంచ్ కొండవేని ఎల్లయ్య, నరేందుల ప్రసాద్, బైరి రవి, మిల్యారి సత్తన్న, యతం రాజు, రాజన్న, పాక భూమన్న, కొప్పుల భూషణ, కొప్పుల శ్రీను, కొప్పుల రవి, అయ్యోరి రాజు, బచ్చు అరవింద్, బచ్చు అన్వేష్, మల్యాల వేణు గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని రామ్‌మందిర్ ఉట్నూర్ నుంచి లింగోజితండా ఎక్స్ రోడ్డు గ్రామానికి భక్తులు శోభయాత్రగా వెళ్లి అయోధ్య నుంచి తెచ్చిన్న రాముల వారి అక్షింతలు గ్రామానికి చేరుకున్నాయి. అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాముల వారి అక్షింతలను సిండే గజానంద్ జాదవ్, నాందేవ్ నాయక్, రాథోడ్ అజయ్, జాదవ్ రవికిరణ్, జాదవ్ వినోద్ లకు అందజేశారు. అక్షింతలను హనుమాన్ మందిరంలో ఉంచి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటిఇంటికి వెళ్లి అందరికి అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారోబారి ధను పృథ్వీరాజ్, గోవింద్, గ్రామ ప్రజలు, మహిళలు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కడెం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఖానాపూర్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మెన్ జితిన్ కుమార్ అన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు పునాది ఈ చదువుకునే సమయమేనని ఇప్పుడు ఒక సంకల్పంతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అలాగే విద్యార్థులు విద్యార్థి దశలోని చట్టాలు చట్టం ద్వారా అందే సేవలు తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు తదితర వాటి పట్ల విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, బక్కశెట్టి కిషోర్, భాశెట్టి శివకుమార్, రాజశేఖర్, రాజలింగం, పరమేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్సై భీమ్‌రావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ సర్వీస్ కమిటీ చైర్మెన్ జితిన్ కుమార్

క్రీడలతోనే మానసికోల్లాసం



గెలుపొందిన క్రీడా జట్టుతో డీఈఓ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని డీఈఓ డాక్టర్. ఏ.రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉమ్మడి జిల్లా కబడ్డీ అండర్-14 జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మానసిక శారీరక పెరుగుదల వికాసనికి, దారుఢ్యాన్ని పెంపొందించడానికి క్రీడలు చాలా అవసరమని అన్నారు. అంతేకాకుండా ఈ క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ బాసర, ఇతర కాంపిటేటివ్ పరీక్షలలో ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి ప్రత్యేక ప్రవేశాలు కల్పిస్తారని అన్నారు. కరోనా అనంతరం విద్యార్థులు ఆటలు ఆడటం మానేశారని అన్నారు. ఈ సంవత్సరం నుంచి విద్యార్థులు పాటల్లో నిర్మల్ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచుటకు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలో మొదటిస్థానంలో నిర్మల్ జిల్లా నిలువగా, రెండో స్థానంలో ఆదిలాబాద్ నిలిచింది. వీరికి ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సాయం అందజేసిన గ్రామ సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మరమేష్, ఎస్ఎంసీ చైర్మెన్ నవీన్, మండల నోడల్ అధికారి ఆర్ అశోక్ వర్మ జిల్లా పరీక్ష విభాగపు కమిషనర్ సిద్ధ పద్మ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వై.రమణారావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, అశోక్, వినోద్, గ్రామస్తులు, నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

- ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థి దశ నుంచే అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శివాజీ అన్నారు. శనివారం పట్టణంలోని ధర్మ విద్యాలయం విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యాలయంలో అగ్నిమాపక సిబ్బంది విధులు, వాహనాలు పనిచేసే తీరును విద్యార్థులకు తెలియజేశారు. ప్రమాదం సంభవిస్తే ఏ విధంగా వ్యవహరించాలో వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివాజీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారించడంతో పాటు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే ప్రతి శుక్రవారం ఓ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించి వారికి ప్రమాదాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా ముందుగా ఫైర్ అధికారులకు టోల్ ఫ్రీ నెంబర్ 101కు ఫోన్ చేసి సరైన చిరునామ తెలుపాలని అన్నారు. కొంత మంది సరైన అడ్రస్ చెప్పని కారణంగా సమయానికి అక్కడి వెళ్లలేకపోతున్నామని, దీంతో అప్పటికే ఆస్థి నష్టం జరిగిపోతుందన్నారు. స్పష్టంగా ప్రమాదం జరిగిన చోటు వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రమాద నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిటకిటలాడుతున్న ఆధార్ కేంద్రాలు

- ఆధార్ అప్‌డేట్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడ్డ జనం



ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన జనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేషన్ కార్డుల్లోని సభ్యులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా కార్డుదారులంతా అవస్థలు పడుతున్నారు. వేకువజామున నుంచే సీసీఎస్, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, ఈ సేవలోని ఆధార్ కేంద్రాల వద్ద కుటుంబ సభ్యులతో సహా కార్డుదారులు రావడంతో కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. కార్డులోని సభ్యులు ఈకేవైసీ చేయించుకోని పక్షంలో వచ్చేనెల నుంచి రేషన్ రాదని ప్రచారం జరుగుతుండటంతో ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. శనివారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రోజుకు 50 మందికే టోకెన్లను అందిస్తున్నారు. ఉదయం నుంచి టోకెన్ కోసం ప్రజలు క్యూకట్టి నిల్చున్నారు. నెల రోజులకు సరిపడ టోకెన్లు అందించడం జరిగిందని బీఎస్ఎన్ఎల్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు 11 సీసీఎస్ కేంద్రాలున్నాయన్నారు. అక్కడ కూడా అప్‌డేట్ చేయవచ్చన్నారు.

ఆడపడుచులకు వరం కళ్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

నిరుపేద ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా రాబోవు రోజుల్లో రూ.1.16 లక్షలతో పాటు తులం బంగారం కూడా ఆడపడుచు పెండ్లికి ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఆరు గ్యారంటీల్లోని ఉచిత బస్సు ప్రయాణం అదేవిధంగా రూ.10లక్షల వరకు ప్రమాద బీమా పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. రాబోవు రోజుల్లో మిగతా నాలుగు గ్యారంటీ పథకాలను కూడా అమలు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.



కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నిరుపేద కుటుంబానికి వీధి ప్రజల సాయం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ వీధిలోని ఎంజాల నరేష్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. నిరుపేద అయిన నరేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం, బతకడానికి ఎలాంటి ఆధారం లేక పోవడంతో అదే కాలనికి చెందిన యువకులు పలువురు దాతలు ముందుకు వచ్చి వాట్సాప్ సమాచారంతో ఆర్థిక సాయం చేశారు. సదరు డబ్బుల నుంచి నరేష్ భార్యకు రూ.11వేల 680నగదును అందజేశారు. మిగతా రూ.50వేలను ఆయన కూతురు పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేశారు. సదరు డబ్బులను వీధి ప్రజల సమక్షంలో అందజేశారు. శ్రీరాంనగర్ వీధి ప్రజల చొరవను పలువురు అభినందించారు. కాగా శాంతీనగర్ వీధికి చెందిన మామిడిపెల్లి రాజ్ కుమార్ అనే వ్యక్తి నరేష్ పిల్లలకు ప్రతి సంవత్సరం పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులను ఇవ్వడానికి ముందుకు రావడాన్ని పలువురు అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం



నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఆడే గంజేందర్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలో గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాల ముఖ్యనాయకులతో చర్చించారు. రాబోయే మండల, జిల్లా పరిషత్, సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. నాయకత్వ లక్షణాలున్న యువతను పార్టీలోకి ఆహ్వానించి, యువకులకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్న సీనియర్లు అందరిని తిరిగి ఆహ్వానించాలని అన్నారు. గ్రామాల్లో ఉన్న స్థానిక సమస్యలను గుర్తించి, అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కుంట ప్రవీణ్‌రెడ్డి, నాగోరావ్, గుడిహత్నూర్ మండల నాయకులు అంకత్ రవి, సీహెచ్ మహేందర్, మాధవ్, విష్ణు, శంకర్, మారుతి, షకీల్ పాల్గొన్నారు.

ఏజెన్సీ అడవులను కార్పొరేట్‌కు ధారాదత్తం చేస్తున్న బీజేపీ

- టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీ భూములను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అటవీ భూములను ఆదాని వంటి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడం మానుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏజెన్సీ చట్టాలైన పీసా, అటవీ హక్కుల చట్టాలను కాల రాస్తోందని విమర్శించారు. క్రమక్రమంగా అటవీ సంపదను కొల్ల గొడుతోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల అటవీ సంపదను కార్పొరేట్‌కు అప్పగించడం మానుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గ్రామ కమిటీ సభ్యులు కోరెంగా నర్సింగ్ రావ్, ఉపాధ్యక్షులు శంభు, విఠల్‌రావ్, జల్పత్, బాలాజీ పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-కడెం

పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఉడుంపూర్ గ్రామం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ చట్టంలో మంజూరైన రూ.9లక్షల 56వేల కాలువ పనులకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోని ఎన్ఆర్ఈజీఎస్ చట్టంలో భాగంగా పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రతి పేదవాడికి అదేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎంపీపీ అలెగ్జాండర్, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ కన్వీనర్ రామ్‌రెడ్డి, ఏడీసీసీ మేనేజర్ మెస్రం కోసేరావ్ పేర్కొన్నారు. శనివారం శంకర్‌గూడ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి, యోజన, అటల్ పెన్షన్, జన్‌దన్ ఖాతా తదితర పెన్షన్ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకాలపై స్క్రీన్ తెర మీద చూపించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి రంగనాథ్, సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్, ఉపసర్పంచ్ సుధీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని గిరవెల్లి గ్రామానికి చెందిన కొటారి ఇస్తారి ఇంటిలో నిల్వ ఉంచిన 70 క్వింటాళ్ల పత్తి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ఒకేసారి మంటలు అంటుకోవడంతో చుట్టుప్రక్కల వారు స్పందించి మంటలర్పారు. దీంతో అప్పటికే ఇల్లు పాక్షికంగా కాలిపోవడంతో పాటు ఇంటిలో నిల్వ ఉంచిన పత్తిలో సుమారు 10 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలి బూడిది కాగా మిగిలిన 60 క్వింటాళ్ల పత్తి నీటితో తడిసిపోయింది. దీంతో సంఘటన స్థలానికి ఆర్ఐ నాందేవ్ వెళ్లి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ఆర్థికంగా నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదానికి గురైన సీఆర్‌టీకి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని డబ్బాగూడ గ్రామానికి చెందిన సీఆర్‌టీ సిడాం గోవర్ధన్ గత నెలలో నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా శిక్షణ కోసం ఆసిఫాబాద్ వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు విరిగిపోయాయి. ప్రమాదానికి గురై కరీంనగర్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం ఇప్పటికే రూ. ఆరు లక్షలు ఖర్చు కాగా సీఆర్‌టీ లతా వైద్య ఖర్చుల నిమిత్తం జమ చేశారు. జమ చేసిన రూ.34 వేలు కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌టీల జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల విజేష్, ఉపాధ్యక్షులు ప్రేమ్‌సాగర్, సీఆర్‌టీలు సురేష్, శంకర్, ప్రసాద్, ధర్మయ్య పాల్గొన్నారు.

ఎస్పీఎం కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ పేపర్ మిల్లు విడుదల చేస్తున్న కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేశారు. శనివారం కార్యదర్శి కార్యాలయంలో ఆయనను కలిసిన ఎమ్మెల్యే వివరాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్పీఎం విడుదల చేస్తున్న వాయు, జల కాలుష్యంతో కాగజ్‌నగర్‌తో పాటూ పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. కార్యదర్శి స్పందిస్తూ కాలుష్యానికి కారణమైన మిల్లుపై విచారణ నిమిత్తం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

నూతన నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామంలో నూతన నర్సరీ పనులను సర్పంచ్ పెందూర్ పవన్ శనివారం ప్రారంభించారు. పనులు పూర్తిచేసి గ్రామంలోని ప్రజలకు నర్సరీలో పెరిగిన మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ దేవిదాస్‌కు సూచించారు. ప్రతిరోజు మొక్కలకు నీరు పోయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో కారోబార్ అశోక్, ఉపాధిహామీ కూలీలు పుష్పలత, మల్లేష్, మౌనిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని వాగుదం గ్రామపంచాయతీ పరిధిలోని గంటలగూడా గ్రామంలోని శ్రీ అన్నారం భీమయ్యక్ ఆలయ వార్షికోత్సవాన్ని 14, 15 తేదీల్లో నిర్వహించారు. కాగా శనివారం వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను సహకార చైర్మెన్ అలీ బిన్ హైమద్, కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడా జట్లు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగారం, కట్టిరావ్, రాము, అనిల్, నీలకంఠరావ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ప్యానెల్ టీం

నవతెలంగాణ-బెజ్జూరు

గిరిజన సంక్షేమ శాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను ప్యానెల్ టీం సభ్యులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత, ఉపాధ్యాయుల విషయ పరిజ్ఞాన విషయంలో వారు బోధించే తీరు, విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే వసతులు, ఇతర సదుపాయలు వస్తున్నాయా లేదా అని తెలుసుకున్నారు. భోజనం సక్రమంగా పెట్టుతున్నారా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగారు. ఈ పర్యవేక్షణలో హెచ్ఎం శ్రీనివాస్, సీహెచ్ ప్రసాద్, పీడీ మధుసూధన్, రాజేంద్రప్రసాద్, ధర్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భరోసా సెంటర్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపాదికన ఉద్యోగాల భర్తీ కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేటగిరిలో 5 ఖాళీలు ఉన్నాయని కౌన్సిలర్ కం సెంటర్ కోఆర్డినేటర్(1), సపోర్టు పర్సన్స్ (2), రిసప్షనిస్టు(1)సేఎస్ఎం(1) ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు పూర్తి సమాచారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్‌బీ ఇన్‌వార్డు సెక్షన్‌లో 12వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పీఆర్టీయూటీఎస్ 2024 క్యాలెండర్‌ను పెట్రోల్ పంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు ఎనగంటి బిక్షపతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో తమ సంఘం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబురావు, జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ సునీత, మండల కార్యదర్శి సుజాత, సభ్యులు విజయలక్ష్మి సత్యనారాయణ గౌడ్, విలాస్, పద్మజా పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి విక్కీ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ శ్రీనాథ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని శనివారం ఆయన గురుకులంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 22న నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ మిని స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 10వ తరగతి చదువుతున్న రాజపెటే విక్కి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుని ప్రథమ స్థానం సాధించడంలో మంచి ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రం తరపున ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 10 నుండి 15 తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బీకనీర్‌లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలో పాల్గొంటడాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేసు ఉపేందర్, కవిత, పీడీ సట్ల శంకర్, పీఈటీ కోట యాదగిరి, హౌస్ మాస్టర్ పి.సైదులు పాల్గొన్నారు.

చేపల కోసం వెళ్లి నీటి కుంటలో పడి మృతి

నవతెలంగాణ-బెజ్జూరు

చేపల కోసం వెళ్లి నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పాపన్నపేటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన దాసరి అశోక్(30) శనివారం చేపల కోసం వెళ్లి నీటి గుంటలో పడి మృతి చెందాడు. మృతుడు అశోక్‌తో పాటు లింగంపల్లి ఆశయ్య, ఎలకరి లింగయ్యలు కలిసి గ్రామ సమీపంలో నీటి గుంటలో చేపలు పట్టేందుకు దిగగా, ప్రమాదవశాత్తు కుంటలో మునిగిపోయాడు. దీంతో అప్రమత్తమైన మృతుని వెంట వచ్చిన ఇద్దరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా మృతుని తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం

నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పన్ను వసూలు లక్ష్యాలను సాధించడానికి నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును ఆదేశించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వసూలు చేసిన వివరాలను ఆర్ఐ, బిల్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎవరూ కూడా వారి వారి విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు అడిగినదానికి సరైన సమాధానం చెప్పకుండా దాటి వేయడంతో అసలు ఫీల్డ్‌కె వెళుతున్నారా లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత రిజిస్టర్‌లు, రికార్డులను ఆన్‌లైన్ రిపోర్ట్‌లను పరిశీలించి, అసహనం వ్యక్తం చేశారు.వంద శాతం వసూలు పూర్తి చేయాలని, మార్చి నెల వరకు ఆగకుండా ప్రతి రోజు ఫీల్డ్‌కే వెళ్లి ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న వారిని గుర్తించి, మొండి బకాయిలను వెంటనే వసూలు చేయాలని అన్నారు. లేని పక్షంలో నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది తమ తమ విధులలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా ఐదు గ్యారంటిల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. శనివారం చివరి రోజు జిల్లా వ్యాప్తంగా లక్ష 81794 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ఈ స్వీకరణ జరిగింది. గ్రామ, పట్టణ, వార్డు సభల ద్వారా అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేశారు. చివరి రోజు ఆసిఫాబాద్ మండలంలో 18307 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ, తహసీల్దార్ తెలిపారు. శనివారం నుంచి 17వ తేది వరకు ఆన్‌లైన్ నమోదు ఉంటుందన్నారు. అనంతరం అర్హుల ఎంపిక కోసం సర్వే ఉంటుందని పేర్కొన్నారు.

కాగజ్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో మున్సిపల్ పరిధిలో 16507 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. వారం రోజుల పాటు వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి స్వీకరించారు.

కాగజ్‌నగర్ రూరల్ : అర్హులను ఎంపిక చేసి తాము ప్రకటించిన ఐదు గ్యారంటిలను అమలు చేసేల కాంగ్రెస్ ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. చివరి రోజు వరకు మండల వ్యాప్తంగా 18810 దరఖాస్తులు వచ్చాయి.

దహెగాం : ప్రభుత్వం పేదలను గుర్తించి పథకాలను అమలు చేయలనే లక్ష్యంతో ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. శనివారంతో ప్రక్రియ ముగిసింది. మండల వ్యాప్తంగా మొత్తం 10527 దరఖాస్తులు అందినట్టు అధికారులు పేర్కొన్నారు.

వాంకిడి : మండలంలో చేపట్టిన ప్రజాపాలన ఐదు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని ప్రజలు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీఓ శివకుమార్, తహసీల్దార్ రెహీమొద్దీన్ తెలిపారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులను ఇవ్వాలని కోరారు. మండలంలోని 28 జీపీల్లో 12420 దరఖాస్తులు వచ్చాయన్నారు.

బెజ్జూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి ప్రజాపాలన కార్యక్రమంలో ఐదు గ్యారెంటీల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. శనివారంతో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో దరఖాస్తు దారులు చివరి రోజు ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన కౌంటర్ల వద్ద దరఖాస్తులను అందించారు. మండలంలో మొత్తం 10587 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీఓ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు అందించిన వాటిని ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించామని, ప్రతి దరఖాస్తు దారుని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తామని ఆయన తెలిపారు.

చింతలమానేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. వారం రోజుల పాటు ఆయా జీపీల్లో సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. చివరి రోజు వరకు మొత్తం 11887 దరఖాస్తులు వచ్చాయి.

కెరమెరి : మండలంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. చివరి రోజు వరకు ఆయా జీపీల ద్వారా 12033 దరఖాస్తులందయని అధికారులు పేర్కొన్నారు. ఆన్‌లైన్ నమోదు కూడా ప్రారంభమైందని తెలిపారు.

పాత్రల బ్యాంకు ప్రారంభించిన ఎస్పీఎం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం), సెంటర్ ఫర్ ఎనివిరాన్మెంట్ సోషల్ పౌండేషన్ (స్పర్ష్) సౌజన్యంతో శనివారం వంజీరి గ్రామంలో కాగితపు పాత్రల బ్యాంకును ప్రారంభించారు. ఎస్పీఎం యూనిట్ హెడ్ ఏకే మిశ్రా మాట్లాడుతూ పాత్రల బ్యాంక్ అనే ప్రాజెక్ట్ ఒకసారి వాడిపడవేసిన, మిగిలిపోయిన వ్యర్థాలను తగ్గించడానికి పనిచేస్తుందన్నారు. పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలు వేగంగా మారడానికి వీలు కల్పిస్తుందన్నారు. స్వయం సహాయక బృందాలు గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో ఉపయోగించే ఒకసారి వాడిపడవేసే వస్తువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా వాటి స్థానంలో పునర్వినియోగ వస్తువులను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముంజం రమేష్, ఎస్పీఎం జీఎం ఎంఎస్ గిరి, సీఎస్ఆర్ మేనేజర్ రీనా, పంచాయతీ కార్యదర్శి నేరెళ్ల రాజేశ్వర్, వీఓ అధ్యక్షురాలు పద్మ, ఏపీఎం ముక్తేశ్వర్ పాల్గొన్నారు.



కాగితపు పాత్రల బ్యాంకును ప్రారంభిస్తున్న ఎస్పీఎం అధికారులు

అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు : ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యంగా ముందుకెళ్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని గండేపల్లి గ్రామంలో బంజారా ఆరాధ్య దైవం శ్రీ సంత్ రామరావు మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కాండ్రే వాగు బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. రెండు కోట్ల 20 లక్షల నిధులతో కాండ్రే వాగు బ్రిడ్జికి నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో మరమ్మతులకు నోచుకొని బ్రిడ్జి పనులతో పాటు రోడ్డు నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. ధనూర్-బిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి పథకం కింద పాఠశాల అభివృద్ధితో పాటు వసతుల కోసం రూ. 21 లక్షలు మంజూరు చేసి నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, ఆత్మ చైర్మెన్ మల్లెపూల సుభాష్, సర్పంచ్ సురేందర్ యాదవ్, సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ కదం ప్రశాంత్, నాయకులు బుచ్చన్న, బొడ్డు శ్రీనివాస్, అల్లం కొండ ప్రశాంత్, మేడిచెల్మ ప్రవీణ్ పాల్గొన్నారు.

కొలాంల అభివృద్ధికి జన్‌మన్ పథకం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

షెడ్యూల్డ్ తెగల్లో అత్యంత వెనకబిన కొలాం(పీవీటీజీ)ల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జన్‌మన్ పథకాన్ని అమలు చేస్తుందని శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మోహతో అన్నారు. శనివారం మండలంలోని గిన్నెర గ్రామంలో సందర్శించారు. ఈ సందర్భంగా కొలాం కుటుంబాలతో సమావేశం నిర్వహించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొలాం తెగల అభివృద్ధి కోసం కనీస మౌలిక వసతులు విద్య, వైద్యం, అంగన్‌వాడి, విద్యుత్తు, సీసీ రోడ్లు, ఇండ్లు సౌకర్యాలను ఈ పథకం కింద కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలతో పాటు వారంవారం పౌష్టికాహారం ప్రత్యేకంగా అందిస్తామన్నారు. కొలాం అభివృద్ధి కోసం ప్రతి గూడెంలో పాఠశాల ఉండాలన్నారు. ఉన్నత విద్య కోసం వసతి గృహాల్లో విద్యాభ్యాసం అందిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్త హీనతతో బాధ పడే వారికి ప్రత్యేక పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. గర్భవతులకు నెలనెలా ఆరోగ్య పరీక్షలతో పాటు, ప్రసూతి కోసం ఉచితంగా వాహనంలో ఆస్పత్రికి తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు.



ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



పేద ప్రజలు, రైతులు, నిరుద్యోగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలని టీజీబీ బ్యాంకు మేనేజర్ రాజగోపాల్ అన్నారు. శనివారం మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుద్రారం శాఖ ఆధ్వర్యంలో నవెగాంలో ఆర్థిక అక్షరాస్యత, ఎంవీ రూరల్ ఫోక్స్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాత వారితో బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ఇంటి నిర్మాణం, విద్య, బంగారం రుణాలు, సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్షా, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగదురహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను నేరుగా బ్యాంకు సిబ్బందితో సంప్రదించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వాలు అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రాఘవేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్రికలు ప్రభుత్వం, ప్రజలకు వారధిగా పని చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సమాజంలో ఉన్న సమస్యలను వెలికితీసి ప్రభుత్వానికి, సమాజానికి మధ్య వారదిగా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేది పత్రికలేనని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో నవతెలంగాణ దినపత్రిక 2024 కాలసూచికను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే బాధ్యత పత్రిక రంగానిదని, దీనిలో భాగంగా నవతెలంగాణ ఆ దిశగా పనిచేయడం, ఈ పత్రికలో పనిచేసే సిబ్బంది త్యాగంతో పని చేయడం అభినందనీయమన్నారు. ఇలాగే భవిష్యత్తులో మరిన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిరంతరం కృషి చేయాలని, పత్రికలంటే కేవలం కొంతమంది వ్యక్తులకు సంబంధించింది కాదని అవి ప్రజలకు సంబంధించిన పత్రికలని, అది కేవలం నవతెలంగాణ పత్రికకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది

- ఎస్పీ కె.సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదోన్నతి ద్వారా బాధ్యత మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ కే.సురేష్ కుమార్ అన్నారు. సివిల్ విభాగంలో ఏఎస్సైలుగా పనిచేస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన ఆర్.తిరుమల, ఎం.రాములు, పి.చంద్రమిశ్రా, ఎం.భోజారావ్, ఆర్.వెంకటేశ్వర్‌లను జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకం, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దీక్షా భూమి జాతర

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో దీక్షాభూమి వద్ద ఆదివారం నుంచి నిర్వహించే జాతరను విజయవంతం చేయాలని బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త కోరారు. శనివారం నాగల్‌కొండలో యూత్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు జాతర కొనసాగుతుందన్నారు. 11న గురుకృప దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని బంజార ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం నుంచి నిర్వహించే జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఉట్నూర్ డిపో నుండి కొత్తపెల్లి దీక్ష భూమి వరకు బస్సు ఏర్పాటు చేశారు. శనివారం ప్రేమ్‌సింగ్ మహరాజ్ చేతుల మీదుగా బస్సుకు జాతర పోస్టర్ అతికించారు. అనంతరం బస్సు సిబ్బందికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మెన్ రెడ్డి జాదవ్, సభ్యులు నరహరి దాస్, రామేశ్వర్, పవార్ దేవిదాస్, మాజీ ఎంపీటీసీ రమేష్ రాథోడ్ ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గణేష్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సి.లక్ష్మణ్ రావ్ వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా కే.గణేష్, ఉపాధ్యక్షులుగా ఆర్. ప్రేమ్ సింగ్, కైలేశ్వరి, కార్యదర్శులుగా సత్యనారాయణ, గాంగారామ్, జే.భారత్, ప్రధాన కార్యదర్శిగా జే.సుకుమార్, కోశాధికారిగా ఎస్.శ్రీకాంత్‌తో పాటు సభ్యులుగా సోనేరావ్, బొజ్జులను ఏకగ్రీవంగా ఎన్నుట్టు ఎన్నికల అధికారి తెలిపారు.

అసిస్టెంట్ కుక్ కోసం దరఖాస్తు

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టు కోసం అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ ఆశన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళ అభ్యర్థులు ఏడో తరగతి పాసై ఉండాలని సూచించారు. 8 నుండి 10లోపు దరఖాస్తులను గాదిగూడ మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సమర్పించాలన్నారు. అర్హత మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

గురుమిలన్ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీ తండా గ్రామపంచాయతీలోని ఎక్స్ రోడ్డు తండాలో లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చలో దీక్ష భూమి గురు మిలన్ దివాస్ కరపత్రాలను నియోజకవర్గం కోఆర్డినేటర్ జాదవ్ రవి కిరణ్, గ్రామ పెద్ద జాదవ్ నాందేవ్ నాయక్‌తో కలిసి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లిలో జరిగే జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా బంజారా ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో జాదవ్ ధన్‌సింగ్, జాదవ్ గణేష్, రాథోడ్ సంజీవ్, కదం ఆనందరావు, రాథోడ్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ శ్యాం ఉన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా విద్యను అందించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, వసతి, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అప్పటికప్పుడే అధికారులతో ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి రేపటిలోగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఇచ్చో, బోథ్ ఎంపీపీలు నిమ్మల ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ కృష్ణ రెడ్డి, రవీందర్ రెడ్డి, మండల మైనారిటీ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

యువకులకు వాలీబాల్ కిట్ అందజేత

నవతెలంగాణ-బోథ్

మాసం లక్ష్మీ వెల్ఫేర్‌సొసైటి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మైసమ్మ కాలానికి చెందిన యువకులకు వాలీబాల్ కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మెన్ మాసం అనిల్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా యువ క్రీడాకారులకు ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగానే కిట్‌లను పంపిణీ చేశామన్నారు. క్రీడలతో పాటు చదువులో ముందుండాలని సూచించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చాటుతూ బోథ్‌కి మంచి పేరు తెవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జటల శ్రీధర్, విన్నర్స్ వాలీబాల్ యూత్ సభ్యులు కార్తిక్, రాజు, సాయిచరణ్, హనుమంత్, తేజ, తమస్, రాజేందర్, మహేష్, మణికంఠ, వినయ్, అజయ్, మనీష్, బన్నీ, సాయిరాం, దీపక్ పాల్గొన్నారు.

ప్రాణహితలో ఒకరి గల్లంతు

నవతెలంగాణ-బెజ్జూర్

బోనాల సందర్భంగా ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఒకరు గల్లంతైన ఘటన శనివారం బెజ్జూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్‌పేట మండలంలోని లోడుపెల్లి గ్రామానికి చెందిన ఆత్రం ధర్మయ్య(48) శనివారం సాయంత్రం మండల సరిహద్దులో ప్రవహిస్తున్న సోమిని ఎర్రబండ రేవు ప్రాణహిత నదిలో స్థానానికి దిగాడు. కుటుంబ సభ్యులు మిత్రులతో కలిసి బోనాలు నిర్వహించేందుకు వచ్చారు. ఈ క్రమంలో స్నానం చేయడానికి ప్రాణహిత నదిలో దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గల్లంతయ్యాడు. కండ్లముందే నీటిలో కొట్టుకపోతుండగా తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ కాపాడలేకపోయారు. రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. ఈ విషయమై బెజ్జూర్ ఎస్సై విక్రమ్‌ను సంప్రదించగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
4
ఆదివారం | జనవరి 7, 2024 | www.navatelangana.com

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 6 గ్యారంటీ స్కీముల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. జన్నారం మండలంలోని 29 గ్రామపంచాయతీలు 34 గ్రామాలలో దాదాపు 17వేల దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ అరుణాని తెలిపారు. శనివారం చివరి రోజు కాగా బంగారు తండా, హాస్టల్ తండా, రాంపూర్ గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ దరఖాస్తులు అన్నింటిని, ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. అనంతరం 6 గ్యారెంటీ స్కీములలో అర్హుల అందరిని గుర్తించి ప్రభుత్వ సూచనలు మేరకు ఆ పథకాలను వర్తింప చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఎంపీ ఈఓ రమేష్ డిప్యూటీ తహసీల్దార్, రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలో అయ్యప్ప స్వామి దీక్ష భూనిన స్వాములు శుక్రవారం శబరిమలైకి తరలివెళ్లారు. 41 రోజుల దీక్షలు ముగియడంతో పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో చంద్రగిరి లక్ష్మణ్, నల్లగొండ నర్సింగ్‌గౌడ్ గురుస్వాముల ఆధ్వర్యంలో దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములకు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించి, స్వాములకు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములు శబరిమలకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రచార కార్యదర్శి దండు సదానందం, కమిటీ సభ్యులు చిలుముల గౌతం, జాడి సతీష్, పిల్లి మణి కుమార్, సురేందర్ స్వాములు వెంకన్న, లంక రామస్వామి, నటరాజ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 9,98,813ఆర్జీలు

- ఎనిమిది రోజుల్లో వెల్లువెత్తిన దరఖాస్తులు
- మంచిర్యాలలో అత్యధికంగా 2,80,489
- ఇతర పథకాలకూ వేల సంఖ్యలో వినతులు
- ముగిసిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ
- ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతున్న వివరాల నమోదు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం పథకాలకు దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. 2023 డిసెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ క్రతువు శనివారం వరకు కొనసాగింది. ఎనిమిది రోజుల పాటు చేపట్టిన ఈ ప్రక్రియలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. నాలుగు జిల్లాల్లో ఐదు గ్యారెంటీలతో పాటు ఇతర పథకాలకు 9,98,813 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇతర పథకాలకు సంబంధించి 1,25,608 వినతులు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కచ్చితంగా అమలు చేస్తామని చెప్పడంతో అనేక మంది గ్రామాల్లో అనేక మంది వీటి కోసం దరఖాస్తులు చేశారు. యువ వికాసం మినహా మిగితా ఐదు గ్యారెంటీలతో పాటు రేషన్‌కార్డులు, ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించడంతో జనం వీటి పట్ల అమితాసక్తి చూపించారు. తొలి రోజు నుంచి చివరి వరకు ఆయా గ్రామాలు, పట్టణాల్లో ప్రజాపాలన పేరిట చేపట్టిన ఈ సభలకు జనం తండోపతండాలుగా తరలివచ్చి ఆర్జీలు అందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. తొలి విడతలో వీటి స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఇదే రోజున ఆన్‌లైన్‌లో వివరాలను క్రోడీకరించే ప్రక్రియను ప్రారంభించారు.



దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనతికాలంలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి పూనుకుంది. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నట్లుగానే వాటిని అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను రూ.10లక్షలకు వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. మిగిలిన వాటి కోసం 2023 డిసెంబర్ 28 నుంచి దరఖాస్తులను స్వీకరణ ప్రారంభించింది. పల్లెల్లో జనాభాలను అనుసరించి కౌంటర్లు ఏర్పాటుచేసి తేదీల వారీగా ఆర్జీలు స్వీకరించగా.. పట్టణాల్లోని ఆయా వార్డుల్లో ఎనిమిది రోజుల పాటు ఈ ప్రక్రియ చేపట్టారు. రోజూ వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చివరి రోజు వరకు లక్షల్లో చేరడం గమనార్హం. ప్రభుత్వం సూచించిన ఐదు గ్యారెంటీలతో పాటు రేషన్‌కార్డులు, ఇతరాత్ర సమస్యలు పరిష్కరించాలని వేల సంఖ్యలో దరఖాస్తులు చేయడం గమనార్హం. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి పేదలకు ఇండ్ల నిర్మాణం లేకపోవడంతో అనేక ఉమ్మడి కుటుంబాలు తీవ్రంగా సతమతమవుతున్నాయి. తాజాగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి సౌకర్యం కల్పిస్తామని భరోసానివ్వడంతో అనేక మంది ఈ పథకం కోసం దరఖాస్తులు అందించారు.

లక్షల్లో దరఖాస్తులు..!

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా ప్రస్తుతం ఐదు గ్యారెంటీలకే దరఖాస్తులు స్వీకరించింది. విద్యార్థుల కోసం ఉద్దేశించిన యువ వికాసం పథకాన్ని మినహాయించి మహాలక్ష్మీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించడంతో వీటిని పొందేందుకు జనం భారీగా దరఖాస్తులు అందించారు. ముఖ్యంగా రైతుభరోసా, చేయూత పథకాలు ఇది వరకు ప్రభుత్వంలోనూ అమలయ్యాయి. మిగిలిన పథకాలు మాత్రం కొత్తగా ఉండటంతో అనేక మంది ఆశతో వినతులు అందించారు. అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో వినతులు రాగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ రెండు లక్షలకు పైగా వచ్చాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రమే రెండు లక్షలకు తక్కువగా రావడం గమనార్హం. ఈ ప్రజాపాలన సభలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టారు. ప్రజాపాలన నోడల్ అధికారిగా నియమితులైన ఐఏఎస్ అధికారి ప్రశాంతితో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. పేదలకు దరఖాస్తులు నింపించడంతో సీపీఐ(ఎం)తో పాటు గ్రామీణ, పట్టణ యువత, అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా సాయం అందించారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా ప్రారంభించిన అధికారులు ఈ నెల 17వ వరకు తుది గడువుగా నిర్దేశించారు. అనంతరం ప్రభుత్వం ఆయా పథకాల అమలు విషయాలను వెల్లడించేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోపక్క మరో నాలుగు నెలల్లో రెండో విడత ప్రజాపాలన సభలు కూడా ఉంటాయని ప్రభుత్వం పేర్కొనడంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేపడుతున్నాం

శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించాం. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ నెల 17లోపు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. మరో నాలుగు నెలల్లోనూ ప్రజా పాలన సభలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో ఐదు గ్యారెంటీలతో పాటు ఇతర సమస్యలకు వచ్చిన వినతులు

జిల్లా	ఐదు పథకాలకు	ఇతర వాటికి	మొత్తం
ఆదిలాబాద్	224136	29145	2,53,281
కుమురంభీం	160779	21015	181794
మంచిర్యాల	250589	32660	283249
నిర్మల్	237701	42788	280489

ప్రజాపాలన బహిష్కరణ



నవతెలంగాణ-దండేపల్లి

మండలం వందురుగూడ ఆదివాసీ గిరిజనులు ప్రజాపాలన కార్యక్రమాన్ని బహిష్కరించారు. చివరి రోజు శనివారం గ్రామంలో ప్రజాపాలన ఏర్పాటు చేయగా అధికారులకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. అధికారులను గిరిజనులు గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని తమ గ్రామంలో నిర్వహించొద్దంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెంకటాపూర్ గ్రామం నుండి వేరు చేసిన తమ గూడాన్ని యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాలుగా తాము నిరసనలు చేపడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాలను ఏమాత్రమూ లెక్కచేయకుండా గ్రామాన్ని ఏర్పాటు చేశారని, పీసా చట్టాన్ని గౌరవించడం లేదని మండిపడ్డారు. పీసా చట్టంలో పొందుపరిచిన విధంగా గ్రామసభ లేకుండా గ్రామాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని, దీనివల్ల ఆదివాసీ గిరిజనలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ గూడాన్ని వెంకటాపూర్ గ్రామంలో యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ ఆందోళనలు ఎన్ని సంవత్సరాలైనా ఇలాగే కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గిరిజనుల అభివృద్ధి కోసమే పీఎంఎస్

నవతెలంగాణ-జన్నారం

అంతరించి పోతున్న ఆదిమ గిరిజన జాతులు, కొల్లం తోటి జాతులను అభివృద్ధి లోకి తీసుకురావడానికి ప్రధానమంత్రి సమాన్ అనే కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని డీటీడీఓ గంగారాం అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గిరిజన గ్రామంలో పీఎం సమ్మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో శాశ్వత నివాసాలు ఇవ్వడం, లింకు రోడ్డు నిర్మించడం, పైపులైన్ ద్వారా నిటీ సరఫరా వసతులను ఏర్పాటు చేయడం, మొబైల్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడమే కాకుండా మందులను సరాపర చేయడం కొనివ్వడం పీవీటీసీల పిల్లలకు వసతి గృహాలు నిర్మించడం ఒకేషనల్ కోర్సులను, నైపుణ్య అభివృద్ధి కోర్సులను ఏర్పాటు చేయడం అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు చేయడం అనే కార్యక్రమాలు ఉంటాయన్నారు. అందులో భాగంగానే కొత్తపేట గ్రామంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. గర్భిణీలకు సాధికారత, సౌర శక్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాటి ద్వారా గ్రామాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం వనదాన్ వికాస్ కేంద్ర క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రధాన మంత్రి జన మన కార్యక్రమం ద్వారా మంచిర్యాల జిల్లాలో ఆరు మల్టీపర్పస్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమాలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ మాలావత్ లావణ్య ప్రేమ్ సింగ్, తహసీల్దార్ వేణుగోపాల్ ఎంపీడీఓ అరుణారాణి కార్యదర్శి భీంరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను అడ్డుకున్న ఆదివాసులు

- రాములు నాయక్‌కు మద్దతు విరమించుకోవాలని డిమాండ్
- దేవాపూర్ ఓరియంట్ కంపెనీ వద్ద ఉద్రిక్తత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ వద్ద తుడుందెబ్బ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను ఆదివాసులు అడ్డుకున్నారు. దేవాపూర్ ఓరియంట్ కంపెనీ ఆవరణలో గుర్తింపు సంఘం ఎన్నికల పోటీకి సిద్ధమవుతున్న రాములు నాయక్‌కు మద్దతుగా నిర్వహించే గేట్ మీటింగ్‌కు ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యేందుకు వస్తున్న క్రమంలో ఓరియంట్ కంపెనీ ముందు ఆదివాసులు అడ్డుకున్నారు. ఆదివాసీలకు కాకుండా మరో గిరిజన వర్గానికి చెందిన రాములు నాయక్‌కు మద్దతు ఇస్తే ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని, మద్దతు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా రాములు నాయక్ ఉన్న సమయంలో ఆదివాసులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఎమ్మెల్యేను అడ్డుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ విషయమై మంత్రులతో చర్చించి నిర్ణయం చెప్తానని ఎమ్మెల్యే ఆదివాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు మడావి వెంకటేశ్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని జెండా వెంకటపూర్ గ్రామానికి చెందిన గంగాధరి శంకరమ్మ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ఎల్‌ఓసీని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స, వైద్య సౌకర్యాలు పొందడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా వైద్య ఖర్చులను ప్రభుత్వమే అందజేస్తారని చెప్పారు.

గాంధారి మైసమ్మ చండీయాగం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయంలో శనివారం ఆలయ కమిటీ వారు నిర్వహించిన సప్త షతి చండీయాగం పూజలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ చండియాగంలో పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో కొత్త గనులకు శ్రీకారం

నవతెలంగాణ-జైపూర్

ఈ ఏడాదిలో సింగరేణిలో ప్రారంభించే 4 కొత్త గనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని కొత్త నూతన బొగ్గు బ్లాకులను సాధించేందకు ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కొత్త గనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. నూతనంగా గనులపై తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, నిర్దేశిత గడువులో పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ఏరియాల జీఎంలను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభించాల్సిన నాలుగు కొత్త గనుల ప్రణాళికలు, పనులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాకు ప్రస్తుత పరిస్థితిపై చర్చించిన ఆయన చివరి దశ అనుమతులకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇందన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొని ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించేందుకు ఈ నెల మూడో వారం భువనేశ్వర్ వెళ్తున్నారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో ప్రారంభించాల్సిన గోలేటి ఓసీ గని అనుమతులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఏడాదికి 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా గల ఈ గని నుండి ఏడాదికి కనీసం 4 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని తెలిపారు. అనుమతుల విషయంలో కాలాయాపన జరిగితే రేట్లు పెరిగి ఉత్పత్తి వ్యయం భారీగా పెరుగుతుందని, ఏరియా జీఎంలు స్థానిక జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సంప్రదిస్తూ అనుమతులు త్వరగా పొందాలని ఆదేశించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-దండేపల్లి

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కోకిరాల ప్రేమ్ సాగర్ అన్నారు. శనివారం మండలంలోని తానిమడుగు వద్ద గల ఇంటెక్ వెల్ వద్ద గల గూడెం సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం ద్వారా దిగువ ప్రాంత అయకట్టు వ్యవసాయ భూములకు యాసంగి పంటకు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ నాయక్‌తో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలైనంత వరకు అరు తడి పంటలు వేసుకోవాలని, సాగునీటిని ఆదా చేయాలని రైతులకు సూచించారు. సాగు నీటిని వృధా చేయడం ద్వారా దిగువ ప్రాంతా రైతులకు నీరందక పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు గడ్డం నాగరాణిత్రిమూర్తి, తహసీల్దార్ సంధ్యారాణి, ఇరిగేషన్ శాఖ డీఈ దశరథం, ఎత్తిపోతల పథకం డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు జాకీర్, అశ్విన్, శ్రీధర్, సంజీవ్, రాజేందర్, స్థానిక సర్పంచ్ పెంద్రం ప్రేమల, ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, తోట మోహన్, కొంగల నవిన్, కంది హేమలత, వనపర్తి మాల్లిక, బొడ్డు కమాలకర్, సర్పంచ్లు భూక్య చంద్రకళ, గోపతి పుష్పలత, శంకరయ్య పాల్గొన్నారు.

హక్కులు, సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచి మెరుగైన హక్కులు సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్సీసీడబ్ల్యుయూ-ఐఎఫ్‌టీయూ)అధ్యక్షుడు బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ బలరాంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు గత ప్రభుత్వం పెంచ లేదని, కాంట్రాక్ట్ కార్మికులు అనేక పోరాటాలు చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం గాని కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. కేసీఆర్ పాలనలో రాష్టంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు 11వ పీఆర్‌సీలో భాగంగా 30శాతం వేతనాలు పెంచడం జరిగిందని కానీ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. అలాగే 2013 నుంచి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన హై పవర్ కమిటీ వేతనాలు అన్ని డిపార్ట్మెంట్ కాంటాక్ట్‌కు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు 11వ పీఆర్‌సీ వేతనాలు అమలు చెయ్యలేదని, 11వ జేబీసీసీఐలో అగ్రిమెంట్ అయిన కోల్ ఇండియా వేతనాలు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయకపోవడంతో సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఆర్థికంగా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా కాంటాక్ట్ కార్యములకు వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులకు లీవులు, జాతీయ పండగ సెలవులు అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులు చనిపోతే కనీసం ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని, సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో వాటాను ఇవ్వాలని తెలిపారు. సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు క్వార్టర్ సదుపాయం కల్పించాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి మెరుగైన వైద్య సౌకర్యం కల్పించడంలో సింగరేణి యాజమాన్యం వైఫల్యం చెందుతుందని, కనుక సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాలు పెంచి ఇతర హక్కులు సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా సింగరేణి సోలార్

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి కాలరీస్ బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్, సోలార్ విద్యుత్ రంగంలో విజయవంతంగా అడుగుపెట్టిన దేశవ్యాప్తంగా సోలార్ రంగంలో ఉండే అవకాశాలను అందిపుచ్చుకోవాలని సంస్థ సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల్లో సోలార్ ప్రాజెక్టులు చేపట్టాలని శనివారం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో చర్చించారు. రాజాస్తాన్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో సోలార్ రంగంలో అడుగుపెట్టి కమర్షియల్ ప్రాజెక్టులు చేపట్టేందుకు అధ్యయనం చేయాలని, వీలైతే సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టాలని ఆదేశించారు. దీనిపై త్వరలో అధికారుల బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి సమగ్ర అధ్యయనం చేసి నివేధిక సమర్పించాలన్నారు. సింగరేణి కాలరీస్ మొదటి దశలో నిర్దేశించుకున్న 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్లలో మిగిలిన 76 మెగావాట్ల ప్లాంట్లను మార్చి నెలాఖారులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సింగరేణి సోలార్ ప్రాజెక్టులకు పూర్తి సహకారం అందిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ హామీ ఇచ్చిందని, రాష్ట్రంలోని జలాశయాలు, కాలువలపై ప్లాంట్ల ఏర్పాటు దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రెండవ దశలో కంపెనీ వ్యాప్తంగా 232 మెగావాట్ల ప్లాంట్లను చేపడుతున్నట్లు డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు వివరించగా ఇందుకు అవసరమైన టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయగలిగితే సంస్థ విద్యుత్ అవసరాలను సోలార్ ప్లాంట్ల ద్వార తీర్చుకోగలమని,తొలి జీరో ఎనర్జీ బొగ్గు కంపెనీగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సోలార్ ప్లాంట్ల పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎస్టీపీపీ ఆవరణలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్, జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో 12 శాతం ఇంధన అవసరాలను సింగరేణి థర్మల్ ప్లాంట్ ద్వార తీర్చగలుగుతున్నామని తెలిపారు. 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు తెలిపారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఆవరణలో రూ.700 కోట్లతో చేపడుతున్న ఫ్లూ గ్యాస్ డిసల్ఫరైజేషన్ ప్లాంట్ పనుల పురోగతిని ఈ సంధర్భంగా అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తైన 224 మెగావాట్ల సోలార్ ప్లాంట్లతో 852 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని, 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వార 60,521 మిలియన్ యూనిట్ల విద్యుత్ గ్రిడ్డుకు అనుసందానం చేయడం జరిగిందని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ వేముల కృష్ణ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం రంగ సంస్థ తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు రుణాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి మహిళల అభివృద్ధికి కషి చేయడం మంచి నిర్ణయమని తెలిపారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి బ్యాంక్ మేనేజర్ రాజ్ అన్సారీ, ఫీల్డ్ ఆఫీసర్ సాయికృష్ణ, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు రాజమల్లు, లక్ష్మీ, శారద, బ్యాంక్ సిబ్బంది, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికి రాములోరి అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను ఇంటింటికి పంచారు. ముందుగా గ్రామ సమీపాన పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న చంద్రమౌళీశ్వర స్వామి రామాలయంలో పూజలు చేసి తలంబ్రాలను తీసుకొని భాజా భజంత్రీలతో, గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ అయోధ్య రామ మందిర నిర్మాణ చిత్రపటంతో సహా కరపత్రం అక్షతలు అందజేశారు. శ్రీరామ నామ స్మరణతో గ్రామమంతా మారు మోగింది. సర్పంచ్ జాడి గంగాధర్ ఎంపీటీసీ వెంకటస్వామి నస్పూరి యుగంధర్ , గుగ్గులావత్ రవి, జాడి వెంకట్, కూకటికారి శంకర్, గంగాధర్, వేముల నారాయణ, దేవ రాజశేఖర్, కమ్మల భూమయ్య, గంజి భూమయ్య, వెంకటరత్నం, శ్రీనివాస్, లచ్చిరెడ్డి, సత్యం, శంకరయ్య పాల్గొన్నారు.